
వర్షం.. అన్నదాతల హర్షం



కనగానపల్లి సమీపంలో వర్షపు నీటితో నిండిన కుంట



చిగిచెర్లలో రోడ్డుపై పారుతున్న వర్షం నీరు

ధర్మవరం రూరల్: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. ఇన్నాళ్లు ఎండ వేడిమితో జనం అల్లాడిపోయారు. ఇప్పుడు వర్షాలు కురుస్తుండటంతో ప్రజలకు ఉపశమనం లభించింది. మరోవైపు రైతులు దుక్కులు దున్నడానికి వ్యవసాయ పరికరాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీనికి తోడు రైతు భరోసా కేంద్రాలలో వేరుశగన విత్తన కాయల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. మొత్తం మీద కురిసిన వర్షానికి రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

ధర్మవరం డివిజన్‌లో ....

ధర్మవరం అర్బన్: ధర్మవరం డివిజన్ పరిధిలో 145.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ ఆదివారం రాత్రి కురిసిన వర్షపాతం మొత్తం 145.0 మిల్లీ మీటర్లు నమోదైందన్నారు. ధర్మవరంలో 6.2 మి.మీటర్లు, బత్తలపల్లిలో 13.4 , కనగానపల్లిలో 74.8 , చెన్నేకొత్తపల్లిలో 14.2, రామగిరిలో 36.4 నమోదైందన్నారు.

74.8 మి.మీ. వర్షపాతం నమోదు

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. కనగానపల్లితో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో 74.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వర్షం వల్ల కొన్ని గ్రామాల్లో చిన్నచిన్న కుంటలు నీటితో నిండిపోయాయి. అలాగే పలుచోట్ల వాగులు పొంగిపొర్లాయి. చాలా రోజుల తర్వాత మండలంలో మంచి వర్షం కురవడంతో ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

బెట్టింగ్‌తో జీవితాలు నాశనమవుతాయి



దంపెట్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: ఎన్నికలు, క్రికెట్, ఇతర బెట్టింగ్‌లకు ఎవరు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం ఆయన తన సిబ్బందితో మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. బెట్టింగ్‌లు వేసి ఆర్థికంగా నష్టపోయి ఇబ్బందులు పడవద్దని సూచించారు. అసాంఘిక కార్యక్రమాల్లో పాలు పంచుకుంటే వారి భవిష్యత్ అంతా నాశనమైపోతుందని చెప్పారు. తద్వారా కుటుంబం బజారు పాలవుతుందన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మండల పరిధిలోని అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వాహన చోదకులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

నాటుసారా స్వాధీనం

- ముగ్గురిపై కేసు నమోదు



గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎస్ఐ శ్రీధర్

ఎన్పీకుంట: మండల పరిధిలోని నల్లగుట్టపల్లి తండాలో 32 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.శ్రీధర్ తెలిపారు. సోమవారం నల్లగుట్టపల్లి తండాలో సిబ్బందితో కలిసి కార్డెన్ అండ్ సెర్చ్ చేపట్టామన్నారు. ఇందులో భాగంగా తండాకు చెందిన మూడే తిరుపాల్ నాయక్, మూడే మంగమ్మ, మూడే పార్వతి నిల్వ ఉంచిన నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం కదిరి ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఎవ్వరూ నాటుసారా తయారు చేయకూడదన్నారు. అమ్మరాదని పలు సూచనలు ఇచ్చారు. అలా కాదని సారా అమ్ముతున్నట్లు తమ దృష్టికి వస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పెట్రోల్ బంకులు, కిరాణా షాపుల్లో లూజ్ పెట్రోల్ విక్రయించరాదన్నారు. అలా విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌టీ హళ్లికి చెందిన బోయ తిప్పేస్వామి ఈనెల 12వ తేదీన అదృశ్యమైనట్లు ఆయన భార్య రత్నమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. తిప్పేస్వామి ఆచూకీ కోసం కర్ణాటక రాష్ట్రం మిడిగేశి, బడవనహళ్లి, పట్టనాయకనహళ్లి తదితర పోలీస్‌స్టేషన్లకు ఆయన ఫొటోను పంపి వెతికే ప్రయత్నం చేస్తామన్నారు.

అదుపు తప్పిన లారీ



పొలంలోకి దూసుకెళ్లిన సిమెంట్ లారీ

మడకశిరరూరల్: కర్ణాటక రాష్ట్రం శిరా వైపు నుంచి వస్తున్న ఖాళీ సిమెంట్ మిక్సింగ్ లారీ మడకశిర మండలం గోవిందాపురం వద్ద సోమవారం తెల్లవారజామున అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం దెబ్బతింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. కేరళ నుంచి శిరా, మడకశిర మీదుగా కర్ణాటకలోని బాగేపల్లికి వెళ్తుండగా ఈ ఘటన జరిగిందని స్థానికులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

అమరాపురం: మండలంలోని ఆలదపల్లి సమీపంలో పెట్రోల్ బంకు వద్ద రెండు వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు... గుడిబండ మండలంలోని గొల్లహళ్లికి చెందిన రత్నమ్మ, భాగ్యమ్మ వారి బంధువు ద్విచక్ర వాహనంలో గొల్లహళ్లి నుంచి అమరాపురం వైపు వస్తున్నారు. ఇదే సమయంలో కర్ణాటక రాష్ట్రం మధుగిరి నుంచి బొలెరో వాహనంలో చెలికెర తాలుకా పరాశురామపురం దగ్గర ఉన్న బండె మారెమ్మ దేవస్థానానికి వస్తుండగా ఆలదపల్లి సమీపంలో ద్విచక్ర వాహనంలో వెళుతున్న వారిని బొలెరో వాహనం ఢీ కొంది. దీంతో భాగ్యమ్మ, రత్నమ్మ కింద పడ్డారు. వెంటనే వారిని మడకశిర ఆస్పత్రికి తరలించారు.

కేజీబీవీ పరిశీలన

గుడిబండ: మండలంలోని కరికెర కేజీబీవీ పాఠశాలను సోమవారం నోడల్ అధికారి ఆనంద్‌బాబు సందర్శించారు. ఈ సందర్భంగా నాడు–నేడు పనులను పరిశీలించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది సీఆర్పీ, పీటీఐ వారితో సమీక్షించారు. బడి బయట ఉన్న విద్యార్థులు, దివ్యాంగుల విద్యార్థుల గురించి చర్చించారు.

'పురం'లో కార్డెన్ సెర్చ్

హిందూపురం అర్బన్: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో సోమవారం సాయంత్రం వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పలువురి ఇళ్లను తనిఖీ చేశారు. సీఐలు వీ. శ్రీనివాసులు, రియాజ్ అహమ్మద్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి ఊరేగింపు



సడ్లపల్లిలో చౌడేశ్వరి దేవిని ఊరేగిస్తున్న దృశ్యం

లేపాక్షి: హిందూపురం మండలంలోని కొటిపి గ్రామంలో వెలిసిన చౌడేశ్వరిదేవి అమ్మవారిని మండలంలోని సడ్లపల్లిలో గ్రామస్తులు సోమవారం ఘనంగా ఊరేగించారు. ప్రతి ఐదేళ్లకొకసారి అమ్మవారిని గ్రామానికి తీసుకు వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి గావు కార్యాక్రమం జరుగుతుందన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు

నల్లమాడ: సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కోసం మండలంలో మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు ఏఓ సుమతి సోమవారం తెలిపారు. రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రానికి ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ తీసుకెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు నల్లమాడ 1, 2, 3, కురుమాల, దొన్నికోట ఆర్బీకేలకు 510 క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా చేశారన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తన పంపిణీ ఉంటుందన్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్

అమడగూరు: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని రైతు భరోసా కేంద్రాలలో మంగళవారం నుంచి ఖరీఫ్ 2024 కు సంబంధించి విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు వ్యవసాయాధికారి వెంకటరమణాచారి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుదూ రైతులు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతో పాటుగా సెల్‌ఫోన్ తీసుకుని ఆర్బీకేలకు వెళ్లాలన్నారు. అలాగే డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఎకరం పైనున్న పాస్‌పుస్తకానికి మూడు బస్తాలు పంపిణీ చేస్తామన్నారు.

29 నుంచి సబ్సిడీ వేరుశనగ పంపిణీ

ఎన్పీకుంట: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు 40 శాతం సబ్సిడీతో విత్తన కాయలు అందజేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి విత్తన కాయల పంపిణీ ప్రారంభం అవుతుందన్నారు. సబ్సిడీపై విత్తన వేరుశనగ కావాల్సిన వారు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం, 1బీ, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 30 కిలోల బస్తాకు 40 శాతం సబ్సిడీ పోగా రూ.1,710, 60 కిలోలకు రూ.3,420, 90 కిలోలకు రూ.5,130 చెల్లించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 29 నుంచి విత్తన కాయలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

గాండ్లపెంట: విత్తన వేరుశనగ కాయల కోసం ఆయా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి లక్ష్మీప్రియ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ధరపై విత్తన వేరుశనగ కాయలను అందిస్తోందన్నారు. కె6 రకం విత్తన కాయలు 30 కిలోల బస్తా రూ.1710, 30 కిలోల రెండు బస్తాలు రూ.3,420, 30 కిలోల 3 బస్తాల ధర రూ.5,130 చెల్లించాలన్నారు. రైతులు నగదును ఆన్‌లైన్‌లో చెల్లించి రసీదు పొందాలన్నారు. పేర్లు నమోదు చేసుకుని నగదును చెల్లించిన రైతులకు సబ్సిడీ వేరుశనగను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తామన్నారు. వేరుశనగ పంట సాగు చేసే రైతులు తప్పని సరిగా రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్‌లో నగదు చెల్లించి రసీదు తీసుకున్న వారికే విత్తన కాయలు అందిస్తామని చెప్పారు.

మరువతండాలో కార్డెన్ సెర్చ్



గాండ్లపెంట: కత్తివారిపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణవేణి



కదిరి అర్బన్: గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ మోహన్

కదిరి అర్బన్: మండల పరిధిలోని మరువతండాలో సోమవారం రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ తన సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. నాటుసారా విక్రయిస్తున్నట్లు అనుమానం ఉన్న ఇళ్లలో సోదాలు చేపట్టారు. గ్రామంలో నాటుసారా తయారీ, విక్రయాలు చేయకూడదన్నారు. నాటు సారా ఎక్కడైనా కాస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు.

కత్తివారిపల్లిలో..

గాండ్లపెంట: మండల పరిధిలోని సోమయాజులపల్లి పంచాయతీ కత్తివారిపల్లి గ్రామంలో సోమవారం ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అనుమానస్పద ప్రాంతాల్లో సిబ్బంది తనిఖీలు చేశారు. అనంతరం ఎస్ఐ గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. గ్రామంలో పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఎవరూ కూడా గుంపులుగా ఉండకూడదని సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. గ్రామస్తులు ప్రశాంత వాతావరణంలో ఉండాలని సూచించారు. ఎలాంటి గొడవలకు వెళ్లారాదని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీలు రామయ్య, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రొళ్ల: మండల పరిధిలోని జీఎస్ పాళ్యం గ్రామం సమీపం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రవి అనే వ్యక్తి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా రత్నగిరి వైపు తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

శాంతి భద్రతలను పరిరక్షించాలి

రొళ్ల: మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేలా ప్రత్యేక నిఘా పెట్టి శాంతి భద్రతలను పరిరక్షించాలని మడకశిర రూరల్ సీఐ రాజకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. పాత పెండింగ్ కేసులు ఏమైన ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. అంగళ్లు, బంక్‌ల యజమానులు పెట్రోల్, డీజిల్‌ను లూజ్‌గా విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, జమేదార్ రమణ, కానిస్టేబుల్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

మడకశిర: ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అర్బన్ సీఐ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. గొడవలు,అల్లర్లు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కౌంటింగ్ రోజున ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కొట్లపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ఓ నగేష్ సూచించారు. సీజనల్ వ్యాధులు, అడాల్ట్ బీసీజీ కార్యక్రమంలో భాగంగా కొట్లపల్లి , రాచువారిపల్లి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అడాల్ట్ బీసీజీతో క్షయ వ్యాధి రాదని, గత ఐదు సంవత్సరాల్లో టీబీ వచ్చి తగ్గిన పోయిన వారు, 60 ఏళ్లు దాటిన వారు, పొగ తాగేవారు, షుగర్ వ్యాధి ఉన్న వారు, ఎత్తు, బరువు తక్కువగా ఉన్న వారు, టీబీ రోగులతో సన్నిహిత సంబంధాలున్న వారు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. రాత్రిపూట దోమతెరలు వాడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల సూచించారు. అలాగే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వెంకటరమణ, ఎస్‌టీఎస్ అబీద్, ఎంఎల్‌హెచ్‌పీ విజయ్‌భాస్కర్, సిబ్బంది రాధ, రత్నమ్మ, సునంద తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎంసెట్‌లో 26వ ర్యాంకు



లిఖేష్ రెడ్డి

ప్రశాంతి నిలయం: తెలంగాణ ఎంసెట్‌లో పుట్టపర్తికి చెందిన కత్తి లిఖేష్ రెడ్డి మెడిసిన్ విభాగంలో 26వ ర్యాంక్ సాధించాడు. అతడిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పలువురు అభినందించారు.

కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో కాటికోటేశ్వర స్వామి

తాడిమర్రి: మండలంలోని చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి స్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి, బత్తలపల్లి, వేల్పుమడుగు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ కుందానం ఆదెప్ప సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేయాలన్నారు. పనులకు హాజరైన వారి పేర్లు మాత్రమే మస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు నాగార్జునరెడ్డి, కమతం సూర్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: వ్యాధులపై నిర్లక్ష్యం వహించకూడదని ప్రత్యేక వైద్యనిపుణులు స్మార్ట్ అభిషేక్ తెలిపారు. పట్టణంలోని దేవి నర్సింగ్ హోమ్‌లో సోమవారం డయాబెటిస్ అండ్ థైరాయిడ్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 30 మంది రోగులకు వైద్య చికిత్సలను అందించారు.

ఓంకారేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో ఓంకారేశ్వరుడు

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో వెలసిన లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుడి ఆలయంలో సోమవారం ఓంకారేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి వివిధ అభిషేకాలు, అర్చనలు ఆలయ ప్రధాన అర్చకులు కేశవస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సచివాలయాల నిర్వహణ బాధ్యత డిజిటల్ అసిస్టెంట్లదే

గాండ్లపెంట: గ్రామ సచివాలయాల నిర్వహణ బాధ్యత డిజిటల్ అసిస్టెంట్లదే అని ఎంపీడీఓ రాయానాయక్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 7 గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న డిజిటల్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. సచివాలయాల ద్వారా జరిగే ఈ సేవలు, వన్‌బీ, జనన, కుల ధృవీకరణ పత్రాల జారీ తదితర సేవలకు సంబంధించిన నగదును రెండవ రోజు ప్రభుత్వ ఖతాలో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రికార్డుల నిర్వహణ కూడా డీఏలే నిర్వహించాలన్నారు. గ్రామ సచివాలయాల్లో పని చేసే మిగితా సిబ్బంది క్షేత్ర స్థాయిలలో వెళ్తారని పేర్కొన్నారు. దీంతో డీఏలు కార్యాలయంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి పనుల నిమిత్తం గ్రామ సచివాలయానికి వచ్చే ప్రజలతో సమస్యలను తెలుసుకుని సేవలు అందించాలన్నారు. గ్రామ సచివాలయాలకు సిబ్బంది సకాలంలో వెళ్లాలని సూచించారు. కార్యాలయంలో సేవలు అందలేదని ప్రజల నుంచి ఫిర్యాదులొస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

23 నుంచి ఏటి గంగమ్మ తిరునాల

తలుపుల: స్థానిక ఎగువపేట సమీపంలోని ఏటి గంగమ్మ ఆలయం వద్ద ఈనెల 23న మొలకల పౌర్ణమి సందర్భంగా మూడు రోజుల పాటు తిరునాల నిర్వహించనున్నారు. 23న ఉదయం 11 గంటల నుంచి గొడుగులను ఊరేగింపుగా తీసుకొస్తారు. ఏటి గంగమ్మకు చీరసారె సమర్పిస్తారు. చెల్లెళ్లు అయిన చింతల గంగమ్మ, గాండ్లపెంట గంగమ్మకు చీర సారె సమర్పించి తిరునాలకు ఆహ్వానిస్తారు. సాయంత్రం 6 గంటలకు బలిజపేట, ఎగువపేట, టి.రెడ్డివారిపల్లి గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో మొలకల సమర్పణ, 24వ తేదీ కుమ్మరపేట, ఎస్సీ, ఎస్టీ కాలనీ, చాకల వీధి ప్రజల ఆధ్వర్యంలో మొలకలు తీసుకొచ్చే కార్యక్రమం , రాత్రికి బలిజపేట నుంచి చాందినీ బండి ఊరేగింపు జరగుతుంది. హరికథా కాలక్షేపం, 25వ తేదీ సాయంత్రం ఎద్ల బండ్లు మెరవని చేపడతారు. 26న అమ్మవారికి బోనాల కార్యక్రమం చేపడతారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న వృద్ధురాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. సోమవారం రాత్రి గుర్తు తెలియని వృద్ధురాలు (70) నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలు కాగా స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధర్మవరం గాయనికి గ్లోబల్ ఐకాన్ అవార్డు



సరళకు అవార్డు అందిస్తున్న ముఖ్య అతిథులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం గాయని సోమిశెట్టి సరళకు గ్లోబల్ ఐకాన్ అవార్డును అందించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం మంజునాథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తృతీయ వార్షికోత్సవం సందర్భంగా పలువురికి గ్లోబల్ ఐకాన్ అవార్డులను అందించారు. ధర్మవరం పట్టణానికి చెందిన గాయని, రచయిత సోమిశెట్టి సరళకు గ్లోబల్ ఐకాన్ అవార్డును అందించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రామచంద్రు తేజావత్, ఐఆర్‌సీఎస్ చైర్మన్ మామిడి భీంరెడ్డి, ఎంపీ కృష్ణయ్య, ఎమ్మెల్యే పద్మారావు, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్, మంజునాథ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మంజులాగౌడ్‌ల చేతుల మీదుగా గ్లోబల్ ఐకాన్ అవార్డును సరళ అందుకున్నారు.

పనులు సద్వినియోగం చేసుకోండి

గుడిబండ: మండల పరిధిలో పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ లక్ష్మీనారాయణ, ఏపీఓ భార్గవి సూచించారు. సోమవారం తాళికెర పంచాయతీలో జరుగుతున్న మినీ అమృత్ సరోవర్ ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈసీ లక్ష్మీనారయణ, టీఏ వెంకటేష్ పాల్గొన్నారు.